క్లుప్తంగా

మనోహర్‌కు దళితరత్న అవార్డు



కల్వకుర్తి రూరల్: జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోహర్ రావు ఆదివారం దళితరత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రావ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని స్ఫూర్తి భవన్‌లో ఈ అవార్డు అందించారని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు కిషన్, సుధీర్, లక్ష్మయ్య, శ్రీనివాస్, రమాకాంత్, గంగారం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

తెలకపల్లి: మండల పరిధిలోని బొప్పల్లిలో ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం మండల పరిధిలోని బొప్పల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీల నుంచి దాదాపు 60 మంది నాయకులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అనేక పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయన్నారు. ఈ అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి అత్యధికంగా చేరికలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలకు అండగా తాను ఉంటానని, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంతో పాటు తెలకపల్లి మండలంలో సస్యశ్యామలం అయిందన్నారు. అనంతరం రాకొండకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బిజ్జ చందు ప్రమాదంలో మృతిచెందాడు. అతడికి బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్నందున పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అతని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ హనుమంతురావు, ఎంపీపీ కొమ్ము మధు, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కోట్ల శ్రీనివాసులు, పరశురాములు, రమేశ్, పరశురాములుతో పాటు గ్రామ నాయకులు బిచ్చలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఫయాజ్



కొల్లాపూర్: సీపీఐ అనుబంధ సంఘమైన ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఎస్‌ఎండీ ఫయాజ్ ఎన్నికయ్యారు. ఇన్సాఫ్ రాష్ట్ర మూడో మహాసభలు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో కొనసాగుతున్నాయి. మహాసభల్లో భాగంగా ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు అజీజ్‌పాషా, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సమక్షంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఫయాజ్ విలేకరులతో మాట్లాడారు. ముస్లిం, మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం ఇన్సాఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని చెప్పారు.

సమ్మె బాటలో కార్మికులు

తెలకపల్లి: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడంలో చిన్నచూపు చూస్తుందని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ మహేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాకొండ, తెలకపల్లి గ్రామాలను సందర్శించారు. వీటితో పాటు వంగూరు, ఉప్పునుంతల మండలంలోని గ్రామాల్లో మహేష్ సందర్శించి గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేయాలని, మెమో నంబర్ 2022ను రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులను కూడా పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని కోరినా... ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే జూలై 6 నుంచి గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలోకి వెళ్తామన్నారు.

నవసంకల్ప యాత్రకు తరలిన నాయకులు

తాడూరు: జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నవసంకల్ప యాత్రకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బీజేపీ నాయకులు లోహిత్ రెడ్డి, రాములు, బాలస్వామి పాల్గొన్నారు.

చారకొండ: బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహాజన్ సంపర్క్ అభియాన్ నవ సంకల్ప సభకు మండలంలోని చారకొండ, జూపల్లి, అగ్రహారం తండా, కమాల్‌పూర్ తండాల నుంచి బీజేపీ నాయకులు ఆదివారం భారీగా తరలి వెళ్లారు.



జోరందుకున్న సాగు

- వర్షాలు ఆలస్యం కావడంతో ఆందోళనకు గురైన రైతులు
- రుతుపవనాల రాకతో ఆనందంలో అన్నదాతలు



ట్రాక్టర్‌తో భూమిని దున్నిస్తున్న రైతు

లింగాల: వర్షాలు జూన్ మొదటి వారంలో కురవకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వానాకాలం ప్రారంభం కన్న ముందుగానే సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసిన వారు కొందరైతే, వర్షాలు ప్రారంభమైన తర్వాత విత్తనాలు, ఎరువులను కొనుగోలు ప్రారంభించారు.

మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యం..

మండలంలో వర్షాధారిత పంటలకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ముఖ్యంగా ఈ ప్రాంత భూముల స్వభాన్ని బట్టీ మొక్కజొన్న పంట సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ సారి వానాకాలంలో మక్కజొన్న సాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఆ తర్వాత పత్తిని సాగు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అంతర పంటగా కందిని సాగు చేయడం, మరి కొన్ని ప్రాంతాల్లో ఆముదం పంటను సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు.



మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు

సాధారణ సాగు 22,500 ఎకరాలు

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం మండలంలో ప్రతి ఏటా సాధారణ సాగు అన్ని రకాల పంటలను కలిపి 22,500 ఎకరాలుగా ఉంటుంది. ఇందులో మొక్కజొన్న 9,860 ఎకరాలు, పత్తి 6,106 ఎకరాలు, కంది 850 ఎకరాలు, వరి 2,800 ఎకరాలు, ఇతర పంటలు 1,850 ఎకరాలు ఉంటుంది. మండలంలో దాదాపుగా 12,545 మంది రైతులు ఉన్నారు. వర్షాలు ఆలస్యమైనప్పటికీ జూలై 15వ తేదీ వరకు విత్తనాలు విత్తుకోవచ్చని ఏఓ నాగార్జున రెడ్డి రైతులకు సూచించారు.

పెట్టుబడులు భరించ లేక పోతున్నాం

సాగుకు పెట్టుబడులు భరించలేక పోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు, విత్తనాలపై సబ్సిడీలు ఎత్తివేయడం ఒక భారమైతే, కూలీల రేట్లు కూడా అధికమయ్యాయని వాపోతున్నారు. ఎకరాకు రూ.10 వేల వరకు వస్తుందని, ప్రభుత్వం రైతుబంధు ఇచ్చే బదులు ఎరువులు, విత్తనాలను సబ్సిడీలతో ఇవ్వడం, పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర పెంపు చేస్తేనే మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన



వంగూరులో సీపీఎం నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వంగూరు: మండలంలోని డిండిచింతపల్లిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని 1997లో అప్పటి ప్రభుత్వం 11 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూమిలో గ్రామంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు ఆదివారం ఆందోళన చేపట్టారు. కొంతమంది గ్రామస్తులు ఆ స్థలంలో గుడిసెలు వేసే ప్రయత్నం చేయగా.. పోలీసులు వారిని అడ్డుకుని తొలగించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగడంతో పోలీసులు వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకుని డిండిచింతపల్లి గ్రామానికి వచ్చిన సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడారు. పోలీసులు సీపీఎం నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పేదల కోసం అప్పటి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఇప్పటి ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించకుండా అందులో ఇతర నిర్మాణాలను చేయడం సబబు కాదని అన్నారు. ఇదిలా ఉండగా.. ఆదివారం ఉదయమే సీపీఎం నాయకులు బాలస్వామి, శివరాములు, జగన్‌ను వంగూరు పోలీసులు అరెస్టు చేశారు.



పెంట్లవెల్లిలో మహిళలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఇల్లు లేనివారు ఉన్నారు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు ఈశ్వర్ ఇల్లు లేని వారితో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెంట్లవెల్లి మండలంలో బీఆర్‌ఎస్ ఏ ఒక్కరికి ఇళ్ల స్థలాలు కాని, డబుల్ బెడ్రూంలు కాని ఇవ్వలేదని, ఎంతో మంది నిరుపేదలు ఇల్లు లేనివారు ఉన్నారన్నారు. ప్రభుత్వం పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హన్మంతు, శ్రీనివాసులు, కృష్ణయ్య, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీపై మండల సమావేశం

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం ఉపాధిహామీ, సామాజిక తనిఖీపై మర్రిపల్లిలో ఎంఆర్సీ కార్యాలయంలో మండల స్థాయి ప్రజా వేదిక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయసుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వంగూరు: మండలం కోనేటిపూర్‌కి చెందిన తోటశైలజ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం విప్ గువ్వల బాలరాజు ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ వైస్‌చైర్మన్ మంద రాజేందర్‌రెడ్డి, జెడ్పీకోఆప్షన్ సభ్యులు హమీద్, బీఆర్‌ఎస్ మండల నాయకులు రాజారంగారావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..

చారకొండ: మండల పరిధిలోని తుర్కలపల్లికి చెందిన కొలుకులపల్లి దేవరాజు మూడు సంవత్సరాల కిందట ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. వారితో పాటు కలిసి చదువుకున్న పదో తరగతి 2000-2001 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఆదివారం తుర్కలపల్లిలో వారి నివాసంలో వారి కుటుంబాన్ని కలిసి వారి బాగోగుల్ని అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్యాభ్యాసంపై వివరాలను అడిగారు. వారితో కలిసి ఉన్న బంధంపై మాట్లాడారు. వారికి అండగా ఉంటామని స్నేహితులు రూ.52 వేల ఆర్థిక సాయం కుటుంబానికి అందజేశారు. పిల్లలకు మంచి విద్య అందించాలని కోరారు.

విశ్వబ్రాహ్మణులకు రూ.లక్ష సాయం అందించాలి

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి విశ్వబ్రాహ్మణ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని మండల సంఘం గౌరవ అధ్యక్షుడు వీరాచారి, అధ్యక్షుడు కృష్ణమాచారి ఆదివారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో నిర్వహించిన మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తలపెట్టిన బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయంలో భాగంగా విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రత్యే తెలంగాణలో మలిదశ పోరాటంలో విశ్వబ్రాహ్మణ శ్రీకాంతాచారి అమరుడయ్యాడన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం అసువులు బాసిన విశ్వబ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పోరాట ఫలితాలతోనే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందనే విషయాన్ని మరిచిపోరాదని గుర్తుచేశారు. సమావేశంలో భాస్కరాచారి, భరత్, చంద్రమౌలి, మల్లాచారి, రామాచారి, తిరుపతయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

నాయకులను విడుదల చేయాలని డిమాండ్

అచ్చంపేట రూరల్: డిండిచింతపల్లిలో గుడిసె వాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, గిరిజన సంఘం జిల్లా నాయకులు శంకర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అయిదు రోజులుగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఖండించారు. అరెస్టులతో ఉద్యమాలు ఆగవని, గుడిసె వాసులకు న్యాయం జరిగే వరకు పోరాటం తప్పదని అన్నారు. ప్రజాసంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



తాడూరు: ప్రమాదవశాత్తు మండలంలోని తిరుమలాపురంలో వంటగదిలో సిలిండర్ పైపు లీకై గాయాలపాలైన యాదగిరిగౌడ్, తిరుపతమ్మ దంపతులకు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అందజేసిన రూ.5 వేలను కాంగ్రెస్ నాయకులు బాలగౌడ్, అర్థం రవి ఆదివారం ఆస్పత్రిలో అందజేశారు. నాయకులు ఐతోల్ లక్ష్మయ్య, పాండు, ఎంపీటీసీ సుశీల, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పెంట్లవెల్లిలో..



అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, గోపాలాచారీ, రామాచారీ, శ్రీధర్, మోహన్, శ్రీను, చంద్రమౌళి పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో 1987-88 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించుకున్నారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు, వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడారు. గురువులు మాకు బోధించిన విద్యతో మేము ఈ రోజు ఒక్కొక్కరం ఒక్కో స్థాయిలో ఉండి, మా కుటుంబాలతో సంతోషంగా జీవిస్తున్నామన్నారు. గురువులను సన్మానించి వారి దీవెనలు తీసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు. సత్యం, రామస్వామి, శ్రీహరి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్నేహితుడికి..

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల ఉన్నత పాఠశాలలో 1997-98వ సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థి ఈశ్వర్‌కు పక్షవాతం రావడంతో తోటి విద్యార్థులు రూ.13 వేలను ఆదివారం ఈశ్వర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుర్మయ్య, రాజేశ్, సలేశ్వరం, చంద్రశేఖర్‌రెడ్డి, సలీం పాల్గొన్నారు.



విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

కల్వకుర్తి రూరల్: జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 2009లో తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నరేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. దళిత బహుజన విద్యార్థులకు కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఇకనుంచైనా 25 శాతం ఉచిత విద్య అందించకుంటే తమకు రావాల్సిన హక్కుల కోసం పోరాడుతామని శ్రీనివాసులు, నరేందర్‌లు హెచ్చరించారు. మురళీ, మహిళా సంఘం నాయకురాలు భారతి, ఝాన్సీ, నవ్యశ్రీ, మంగ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన వారికి సన్మానం



జంగారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కల్వకుర్తి రూరల్: దివంగత ప్రధాని ఇందిరా గాంధీ 1975లో విధించిన ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన పట్టణానికి చెందిన జంగారెడ్డిని ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఎల్లప్ప, కిష్టారెడ్డి, జంగారెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కమలాకర్ రెడ్డి, చంద్రారెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఆంజనేయులు, గౌస్, పరశురాములు, నర్సింహులు శెట్టి ఎమర్జెన్సీలో జైలు పాలయ్యారన్నారు. ఆ చీకటి రోజులను ఎదుర్కొని జైలుకు వెళ్లిన వారంతా ధైర్యవంతులని, వారి త్యాగాలను స్మరించుకుని కాంగ్రెస్ విధానాలను, చరిత్రను నేటి యువత ప్రజలు తెలుసుకోవాలని నర్సింహ పిలుపునిచ్చారు. దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, రాజుగౌడ్, హరికృష్ణ, శ్రీకాంత్, సుమన్ పాల్గొన్నారు.

పోడు హక్కు పత్రాల పంపిణీని కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌నాయక్

కొల్లాపూర్: పోడు హక్కు పత్రాల పంపిణీని కొనసాగించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ కోరారు. ఆదివారం కొల్లాపూర్‌లో గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌నాయక్ మాట్లాడారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. కారణాలు లేకుండానే హక్కుపత్రాల పంపిణీ వాయిదా పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. హక్కు పత్రాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది గిరిజనులు ఎదురుచూస్తున్నారని, వెంటనే పంపిణీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు గోవింద్‌నాయక్, భరత్, గణేష్, మత్స్య, రాజునాయక్ తదితరులున్నారు.

చిన్నారులతో బండి సంజయ్ మాటామంతి



చిన్నారులతో మాట్లాడుతున్న బండి సంజయ్

వెల్దండ: మండల పరిధిలోని రాఘయపల్లి గేట్ సమీపంలోని అబిస్తా హోటల్‌లో ఆదివారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ చిన్నారులను కలిసి పలకరించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. తిరిగి హైదరాబాద్ వెళ్తున్న బండి సంజయ్ మార్గమధ్యలో వెల్దండ మండలం రాఘయపల్లి గేట్ సమీపంలో అబిస్తా హోటల్ వద్ద కార్యకర్తలతో చాయ్ తాగారు. ఇదే క్రమంలో కార్యకర్త పిల్లలతో మాట్లాడారు. పాఠశాల కబుర్లు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోహర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఆశ్విత

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్‌తండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి తండాకు చెందిన యూట్యూబర్ బంజార సింగర్ ఆశ్విత ఆదివారం రూ.25 వేల విరాళం సర్పంచ్ అంజినాయక్‌కు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. విరాళం అందజేసిన సింగర్‌ను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మీపతినాయక్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌కి చెందిన గీత కార్మికుడు కేషమోని యాదయ్య గతంలో తాటి చెట్టుపై నుంచి కింద పడి మృతి చెందాడు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును మృతుని భార్య యాదమ్మకు ఆదివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హైదరాబాద్‌లో అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్మిక కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రమేష్‌గౌడ్, రవి, శేఖర్, గణేష్, విష్ణువర్ధన్ రెడ్డి, తిరుపతయ్య, మల్లేష్, తిరుపతయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు బురదమయం

తాడూరు: మండలంలోని ఎంగంపల్లి నుంచి ఆకునెల్లికుదురుకు వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షం పడిందంటే గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా తయారై, రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గతంలో కొంతమేర సీసీ ఏర్పాటు చేసి మిగతా సగభాగం గాలికి వదిలేశారని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు, రేషన్‌తో పాటు వివిధ పనుల నిమిత్తం ఆకునెల్లికుదురుకు వెళ్లి రావాలంటే నానాయాతన పడాల్సి వస్తుందని, అధికారులు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ నాయకులు

తాడూరు: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ ముదిరాజ్ సంఘం మండల నాయకులు శ్రీనివాసులు, నంద మల్లయ్య, శంకర్, రమేష్, శివ ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అమరవీరుల స్తూపం వద్ద ఓ మహిళా కార్యకర్త తమ హక్కుల గురించి నేతలను నిలదీస్తుండగా అక్కడకు ఓ యూట్యూబ్ న్యూస్ మీడియా రిపోర్టర్ రికార్డు చేస్తుండటం చూసిన కౌశిక్‌రెడ్డి తన అనుచరులతో కిడ్నాప్ చేసి హుజూరాబాద్ తీసుకెళ్లి నిర్బంధించి దూషించి, చిత్రహింసలకు గురిచేశారని అన్నారు.